క్లుప్తంగా

సర్వేలో హేతుబద్ధత లేదు

గుండాల: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్న సర్వేలో హేతుబద్ధత లేదని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలు చేస్తూ అనేక ఆంక్షలు విధిస్తున్నారని, ఇలాంటి ఆంక్షలు విధిస్తే రైతులకు ఎలాంటి నష్టపరిహారమూ రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమరం సీతారాములు, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, ఈరెం నరేష్, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, అజ్జర్, వాగబోయిన బుచ్చయ్య, బచ్చల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

లాప్‌ట్యాప్ అందజేత

మణుగూరుటౌన్: ఇంజనీరింగ్ విద్యలో ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థిని రాపర్తి మౌనికకు మణుగూరు లయన్స్‌క్లబ్ ఆఫ్ లెజెండ్ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు చేతుమీదుగా లాప్‌ట్యాప్ అందించారు. మౌనిక తండ్రి రాపర్తి జానీ రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని కూతురు ఇంజనీరింగ్ చదువుతోంది. చదువులో మంచి ప్రతిభ చాటుతున్న ఆమెకు కావాల్సిన రూ.40వేల విలువైన ల్యాప్‌ట్యాప్‌ను మణుగూరు లయన్స్‌క్లబ్ ఆఫ్ లెజెండ్ సభ్యులు కుడితిపూడి వెంకటేశ్వరరావు, రీజన్ చైర్మన్ గంట రమేష్‌బాబు, జోన్ చైర్‌పర్సన్ దుస్సా సమ్మయ్య, లెజెండ్స్ లీగల్ అడ్వయిజర్ కందిమల్ల నర్సింహారావుల సహకారంతో అందజేశారు. మంచి లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డీఎస్పీ రాఘవేందర్‌రావు ఆకాంక్షించారు.

మోదీని గద్దె దించాలి

బూర్గంపాడు: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సోంపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తు ఏప్రిల్ 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బర్ల తిరుపతయ్య, నిమ్మల అప్పారావు, ధనుగూరి నాగేశ్వరరావు, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం బీసీలను చిన్న చూపు చూస్తోందని, బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. పట్టణంలోని ఆమె నివాసంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో పల్లె పల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కేసీఆర్ రాష్ట్ర క్యాబినెట్‌లో ముగ్గురుకి మాత్రమే మంత్రి పదవి ఇచ్చారని ఆరోపించారు. బీసీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేసి బీసీ బంధును అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రాంతి కుమార్, రామ్మోహన్‌రావు, వెంకన్న, చక్రవర్తి, కేశవ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, క్రాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

దుమ్ముగూడెం: మండలంలోని పశువుల సంచారం వల్ల పంటలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటి సంచారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీఓ ముత్యాలరావులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండో పంట వేసుకున్న క్రమంలో పశువులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు వినీల్, యలమంచి వంశీ, గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టడికి తహసీల్దార్ ఆదేశం..

మండల రైతుల వినతి మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ వెంటనే చర్యలు తీసుకున్నారు. మండలంలో రెండో పంట పూర్తయ్యే వరకు పశువుల యజమానులు తమ పశువులను వదిలి పెట్టకుండా సంరక్షించుకోవాలని, రైతులు వేసిన పంటలకు నష్ట వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

కొమరయ్య జయంతి

మణుగూరురూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతిని మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుతగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ కారం విజయ కుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహరావులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దొడ్డి కొమరయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, ఏఈ రామారావు, కత్తి రాము, మండల కో ఆప్షన్ సభ్యుడు జావిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పార్కింగ్ దోపిడీ

- అడ్డగోలుగా అధిక ఫీజు వసూలు
- ప్రశ్నించిన వారిపై దాడులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



రశీదుపై ఫీజు అంకెలు కనిపించకుండా వేసిన ఇంకు సీలు


పార్కింగ్ ఫీజులు కనిపించకుండా మరో బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి సీతారామచంద్ర స్వామివారి దేవాలయానికి వచ్చే భక్తులను వాహన పార్కింగ్ పేరిట యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. రామయ్య దర్శనం కోసం ఎంతో ఆశతో వచ్చే భక్తులకు ఆదిలోనే పార్కింగ్ ఫీజు పేరిట అధికంగా వసూలు చేస్తూ కాంట్రాక్టర్ చుక్కలు చూపిస్తున్నాడు. భద్రాచలం గ్రామ పంచాయతీ నిబంధలనకు విరుద్ధంగా వాహనదారుల వద్ద కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేస్తున్నాడు. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులే నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో భక్తులు చేసేదేమి లేక రామయ్య ఏంటయ్య ఈ బాదుడు అనుకుంటూ మదనపడుతున్నారు.

ఆశీలు వసూలు చేయాల్సింది ఇలా..

భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాహనాలకు పార్కింగ్ ఫీజును కాంట్రాక్టర్ వసూలు చేసుకోవచ్చు. ఆ నిబంధనల ప్రకారం వాహన పార్కింగ్ కోసం చిన్న కారుకు (5సీట్ల) రూ.30, పెద్దకారుకు (5 సీట్ల కంటే ఎక్కువ) రూ.50, పెద్ద వాహనాలు (7 సీట్ల కన్నా ఎక్కువ) రూ.150 ఫీజును వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ రూ.30కి రూ.100, రూ.50కి రూ.150, రూ.150కి బదులు రూ.300 బలవంతంగా వసూలు చేస్తున్నాడు. వాహనదారుల వద్ద కాంట్రాక్టర్ ఎంత వసూలు చేయాలనే వివరాలను సూచించే బోర్డుకు అడ్డుగా మరో ఖాళీ బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు ఎంత పార్కింగ్ ఫీజు చెల్లించాలనేది తెలియక కాంట్రాక్టర్, సిబ్బంది అడిగినంతా చెల్లించి వెళ్తున్నారు.

మరో పక్క వాహనదారుకులు ఇచ్చే రశీదులో ఫీజుకు సంబంధించిన అంకెలు కనపడకుండా ఇంకుతో ముద్ద సీలు వేస్తున్నారు. ఈ విషయమై వాహనదారులు ప్రశ్నిస్తే వారికి దురుసుగా సమాధానం చెప్తున్నారు. భద్రాద్రికి వచ్చే వాహనాలకు గతంలో కూడా అధికంగా వసూలు చేయడంతో పాటు రశీదులో నగదు కనిపించకుండా ఇంకు ముద్దలా సీలు వేయడంపై భక్తుల అధికారులకు ఫిర్యాదు చేశారు. కాని సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

చర్యలకు పంచాయతీకి అధికారం..

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భద్రాద్రి రామాలయానికి వచ్చే భక్తులకు సంబంధించిన వాహనాలకు పార్కింగ్ ఆశీలు వసూలు వేలం పాటను ప్రతి ఏడాదీ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాటను దక్కించుకున కాంట్రాక్టర్ ఏడాది పాటు పంచాయతీ నింధనల ప్రకారం వాహన పార్కింగ్ ఫీజు వసూలు చేసుకుంటాడు. నిబంధలనకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూల్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత కాంట్రాక్టర్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకునే అధికారం పంచాయతీ అధికారులకు ఉంటుంది. ప్రస్తుతం జరిగిన ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాహనాలకు అధికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేయడంపై విచారణ జరిపించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వాహనాల పార్కింగ్‌కు సంబంధించి అధిక ఫీజు వసూలు చేసే విషయమై మాకు ఫిర్యాదు వచ్చింది. ఈ ఘటనపై విచారణ జరిపించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్ వద్ద నుంచి సంబంధిత బిల్లు బుక్కులను స్వాధీనం చేసుకున్నాం. విచారణ అనంతరం నోటీసులు జారీ చేస్తాం.

– వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ ఈఓ

పోషకాహారంతోనే ఆరోగ్యం


అశ్వాపురం: గర్భిణికి సీమంతం చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి, గ్రామస్తులు

అశ్వాపురం: బలమైన పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మల్లెలమడుగు సర్పంచ్ కోడి కృష్ణవేణి అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేసి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రెడ్డి అరుణ, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: చిరు ధాన్యాల పంటలను రైతులు సాగు చేయాని, అలాగే ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సీడీపీఓ రోజారాణి అన్నారు. మండల పరిధిలోని జమ్మిగూడెం, ఊట్లపల్లి, కేశప్పగూడెం గ్రామాల్లో సోమవారం 'పోషణ పక్వాడా' కార్యక్రమంలో భాగంగా పంట పొలాలకు వెళ్లి రైతులు, కూలీలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. చిరు ధాన్యాల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

దమ్మపేట: పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి చిరుధాన్యాలపై గర్భిణులు, పిల్లలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని మల్కారం సెక్టార్‌లోని పెద్ద గొల్లగూడెం గ్రామంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో సరైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం సెక్టార్ పరిధిలోని గర్భిణులకు సీమాంతం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ సావిత్రి, సూపర్వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న అసోసియేషన్ నూతన అధ్యక్షుడు దేవదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు దేవదానం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోర్టు ప్రాంగణంలో సీనియర్ న్యాయవాది నందూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం మెజిస్ట్రేట్ ఎం.నీలిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా బార్ ప్రెసిడెంట్ కోట దేవదానం మాట్లాడుతూ.. న్యాయ పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా భద్రాచలం పట్టణంలో సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయవాదులు అందరూ ఉమ్మడిగా పోరాటం చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీకి మెజిస్ట్రేట్ చేతుల మీదుగా ప్రమాణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి అంబేడ్కర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జయరాజ్ సీనియర్ న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, శ్రీనివాస చారి, గణపతి, సున్నం రమేష్, చీమల నరసింహారావు, న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించారు..


మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వర్లు

చంద్రుగొండ: ఎన్నికల హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. చంద్రుగొండలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. తొమ్మిదేళ్ళ పాలనలో ఏజెన్సీ జిల్లాల్లో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెంలో గల వెంగళరాయసాగర్ అలుగుకు గండిపడి మూడేళ్లైనా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. సత్వరమే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు కేశబోయిన నర్సింహారావు, బొర్రా సురేష్, సంకా కృపాకర్, అంతటి రామకృష్ణ, బుంగా శ్రీనివాస్, కొలిపాక అప్పారావు, మనోహర్ పాల్గొన్నారు.

రామాలయాల్లో అన్నసమారాధన


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారం వారిగూడెం కాలనీ, మండల కేంద్రంలోని వడ్డెర బజారులోని రామాలయాల్లో సోమవారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాల్లో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు స్వయం వడ్డించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ నారం రాధ, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, జేకేవీ రమణారావు, తాడేపల్లి రవి, మోటూరి మోహన్, సత్యవరపు సంపూర్ణ, డేరంగుల శ్రీను, దుర్గ, మంగరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు సాయం

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన గురజాల సత్యవతి(46) గుండె పోటుతో ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త గురజాల వెంకటేశ్వర్లు గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడం, కుమారుడు ఒంటరివాడు చిన్న వయస్సు కావడంతో సత్యవతి దహన సంస్కారాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ రూ.2 వేలు, ఎంపీపీ ముత్తినేని సుజాత కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు అందించారు. జెడ్పీటీసీ సులక్షణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ వీరభద్రం మృతదేహానికి నివాళులు అర్పించి దశ దినకర్మలకు క్వింటా బియ్యం అందజేస్తామని హామీ ఇచ్చారు.

అనారోగ్య బాధితుడికి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన సంఘ సేవకుడు గుమ్మడి రాజుకు సోమవారం పలువురు ఆర్థిక సహాయం చేశారు. గుమ్మడి రాజు గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో దాతలు ఆయనకు పలు రకాలుగా సహాయం చేస్తున్నారు. వారిలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రూ.4 వేలు, సోమరౌతు శ్రీనివాస్, బిల్లిపల్లి రంగారావు, శ్రీధర్, రమేష్ రూ.4 వేలు అందజేశారు. అలాగే అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పూసం రవికుమారి వైద్య ఖర్చుల కోసం రాజుకు రూ.4 వేలు అందజేశారు.

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ధ కాలనీ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం సహాయ కార్యదర్శి మోదుగు వంశి జ్వరంతో బాధపడుతుండటంతో సోమవారం యువజన విభాగం పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్ యాదవ్ వంశిని పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు నజీర్‌షాను, ఇరుగు నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు..

అశ్వాపురం: అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందిన మండల పరిధిలోని అమెర్ధ గ్రామ పంచాయతీలోని అంబేడ్కర్ నగర్ గ్రామానికి తోకల పవణ్ కల్యాణ్ (24) మృతదేహానికి సోమవారం బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. రూ.7 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్‌ఎంపీపీ వీరభద్రం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తూము చీనవీరరాఘవులు, చిలకా వెంకటరామయ్య, సత్యనారాయణరెడ్డి, లంకెల రమేష్, నజీర్‌షాను పాల్గొన్నారు.

గిరిజనులకు వితరణ


గిరిజనులకు వితరణ అందజేస్తున్న సీఐ శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్

అశ్వాపురం: మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో 141 బెటాలియన్ భద్రాచలం సీఆర్‌పీఎఫ్, అశ్వాపురం పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజనులకు చేయూత అందిస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటాపురం, మామిళ్లవాయి గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో 32 కుటుంబాలకు, మామిళ్లవాయి గ్రామంలో 35 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు గ్లాసులు, రెండు ప్లేట్లు, ఒక కడాయి, 20 కేజీల బియ్యం డబ్బాలను అందజేశారు. వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో 41 మంది విద్యార్థులకు, పది మంది గ్రామ పంచాయతీ కార్మికులకు, గ్రామస్తులకు గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాలలకు 12 చొప్పున వాలీబాల్ కిట్లు, పుట్‌బాల్ కిట్లు, క్యారమ్స్, చెస్ అందజేశారు. కార్యక్రమంలో అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ దేవన్న, కిషన్‌సింగ్, ఏఎస్ఐ సుహాగ్, సర్పంచ్ మడకం సాధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు సంత వేలం పాట

బూర్గంపాడు: మోరంపల్లిబంజర సంత వేలం పాటను ఏప్రిల్ 5వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాయి తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో బుధవారం ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సంత వేలం పాటను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.లక్ష డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

కార్గో తలంబ్రాలకు స్పందన

మణుగూరుటౌన్: టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోని కార్గో ద్వారా సీతారాముల కల్యాణం తలంబ్రాలు అందించడానికి చేసిన ఏర్పాట్లకు విశేష స్పందన ఉందని మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. సోమవారం మణుగూరు మండలంలోని కార్గో ద్వారా తలంబ్రాలు బుక్‌చేసుకున్న వారికి అందించడం జరిగిందన్నారు. ఈనెల 10 వరకు కార్గో ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. భక్తుల కోరిక మేరకు ఈ అకాశాన్ని పొడిగించినట్లు తెలిపారు. కావలిసినవారు స్థానిక కార్గో కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బూర్గంపాడు: సారపాకకు సమీపంలో గోదావరి బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. భద్రాచలం వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న గంగరాజు అనే వ్యక్తిని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో రోడ్డుపై పడిన గంగరాజు కాళ్లపై నుంచి ట్రాక్టర్ వెళ్లిపోయింది. దీంతో అతని కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయానికి వితరణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామ సమీపంలోగల సమ్మక్క-సారక్క ఆలయానికి సోమవారం పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా వితరణ అందించారు. ఈ మేరకు ట్రస్టు ద్వారా రూ.20వేలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించగా, ఈ నగదును స్థానికులు జూపల్లి రమేష్ చేతుల మీదుగా ఆలయ బాధ్యులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు జారే ఆదినారాయణ, ప్రమోద్ పాల్గొన్నారు.

పునరుద్ధరించండి..

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను తిరిగి పునరుద్ధరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో లక్షల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన బస్టాండ్‌ను నిరుపయోగంగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల రాకపోకల కోసం ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే వేచిచూడాల్సి వస్తోందన్నారు. ఎండ, వాన, చలికి ప్రయాణికులు రోడ్లపైనే ఉండాల్సి వస్తుందని, సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

మంచినీరు అందించాలి

గుండాల: యాపలగడ్డ గ్రామ సమీపంలోని పగిడిద్దరాజు గద్దెల వద్ద నూతనంగా నిర్మించిన నూతన డబుల్ బెడ్రూం ఇళ్లకు మంచినీటి సౌకర్యం కల్పించాలని న్యూడెమోక్రసీ నాయకులు గడ్డం లాలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీఓ హజరత్ వలీకి వినతిపత్రం అందించారు. రూ.కోట్లతో నిర్మించిన ఇళ్లకు బోర్లు వేశారని, మోటార్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెం రామారావు, మోకాళ్ల రమేష్, తాటి రవి, ఈసం ప్రవీణ్, నాగేష్ పాల్గొన్నారు.

యువతికి పొంగులేటి చేయూత


యువతితో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగ దివ్యాంగ యువతికి ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేయూతనందించారు. ఇటీవలే నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఆమె అర్హత సాధించగా.. ఆ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రద్దు అయింది. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థిని కుటుంబాన్ని పొంగులేటి ఆదివారం ఇంటికెళ్లి పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-2 పరీక్ష పత్రాల లీకేజీతో రాష్ట్రంలో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఆందోళన చెందాల్సిన కార్యక్రమంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తుళ్లూరి బ్రహ్మయ్య, తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన దివ్యాంగురాలు బాసిపోగు భవానీకి సోమవారం బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. భవానీ ఇటీవల గ్రూప్-2 పరీక్షకు క్వాలిఫై అయింది. ప్రశ్నా పత్రాలు లీక్ కావడంతో తిరిగి పరీక్షలకు సిద్ధమవుతుంది. ఈ క్రమంలో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను గుర్తించి సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన వి.శ్రీవ్యాల్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు శరత్ ద్వారా పంపిన రూ.15వేలను స్థానిక వైద్యులు పవన్ కుమార్ చేతుల మీదుగా భవానీకి అందించారు. అలాగే పవన్ కుమార్ తన వ్యక్తిగతంగా మరో రూ.5వేలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కె.బ్రహ్మాచారి, యంబి.నర్సారెడ్డి, గద్దం స్వామి, ఎం.రేణుక, ఎస్.లీలావతి, డి.లక్ష్మి, బి.కుసుమ, జ్యోతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో అగ్నిమాపక భద్రత విభాగం ఆధ్వర్యంలో సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అగ్నిమాపక పరికరాల వినియోగం గురించి కార్మికులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమానికి హాజరైన బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న కార్మికులకు సీపీఆర్‌ను ప్రత్యక్షంగా చేసి చూపించారు. సింగరేణి కాలరీస్ రెస్క్యూ ఆపరేషన్స్-కొత్తగూడెం ఇన్‌చార్జ్ అనంత రాములు వారి బృందంతో అత్యవసర కార్యకలాపాలు, సీపీఆర్‌పై ప్రదర్శన, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు టి.శ్రీనివాసరావు, రమేష్‌బాబు, డీఈ సేఫ్టీ జి.ఆనంద్‌ప్రసాద్, డీఈ శ్రీధర్, రెస్క్యూటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు పరీక్షలు ప్రశాంతం

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు తొలి రోజు 8.30 గంటలకే చేరుకున్నారు. మొదటి రోజు తెలుగు పరీక్ష రాశారు. జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఎండ తీవ్రత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎంఈఓలు కేంద్రాలను తనిఖీ చేసి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

– సాక్షినెట్‌వర్క్


అశ్వాపురం: పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలు తరలిస్తున్న పోలీసులు


అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


అశ్వారావుపేటరూరల్: పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు


మణుగూరుటౌన్: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మణుగూరు సీఐ ముత్యం రమేష్


చంద్రుగొండ: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు